# మనిషి కథ

## విహారి

శంకరం వెళ్ళిపోయాడు.

ధర్మారావుకు ఇల్లంతా ఏదో వెలితిగా వుంది. మనసు మనసులో లేదు.

వరమ్మ మళ్ళీ — బావిదగ్గర బట్టలు ఉతికే కార్యక్రమం మొదలెట్టేరు. తోమిన గిన్నెల్ని తొలిచి చక్కగా పెడుతోంది. శాంతమ్మ, రామం, ప్రభ, చంద్ర — గేటుప్రక్కనున్న సీమ చింత చెట్టుమీద తమ ప్రతాపం చూపిస్తున్నారు.

ధర్మారావు కాలుగాలిన పిల్లిలా తిరగసాగేడు. వరండాలోనుంచి కాంపౌండు గేటు దాకావచ్చి, మళ్ళీ వెనక్కు వెళ్తు షికార్లు చేస్తున్నాడు. చేతులు రెండూ వెనక్కి కట్టుకుని నడుస్తున్నవాడల్లా ఆగి — వున్నుండి ఓసారి వాటిని గాలిలో ఆడిస్తూ, అంతలోనే చప్పట్లు చరిచి, పెదవి విరిచి — మళ్ళీ షికార్లు ప్రారంభిస్తున్నాడు.

ఇంటివాళ్ళ పోర్షన్‌లో — పిచుగులు రుబ్బుస్తున్నాడు, కామేశంగారు. ఆయనే ఆ ఇంటికి యజమాని. "మళ్ళెప్పుడైనా వాచెప్పు వాడిలో ప్రాణం వుంటుగా అది వా గుమ్మం తొక్కడానికి వీల్లేదు, ఇది అక్కడికి పోవడానికి వీల్లేదు, ఇవిడిక్కడ పడ్డివా మొత్తుకున్నా, నేమీ జరిగిపోను. ఆడిమూలకి రావికే అంతప దల వుంటే — ఇక్కడెవరూ గాజులు తొడుక్కుని కూర్చోలేదు. ఈ సంగతి నీ కోడలికి అర్థమయ్యేట్టు చెప్పు."

కామేశంగారు తన కొడుక్కి తెలిసి కూతుర్నే చేసుకున్నారు. ఆమె భర్త పోయి చాలాకాలమైంది. అన్నా చెల్లెళ్ళ మధ్య మాట పట్టింపులూ, ఏకాలూ రెచ్చిపోయి రాకపోకలు ఇంధయిపోయినై. అయినా, కూతుళ్లు పుట్టింటి ఆశని చంపుకోలేక — పండక్కి, శ్రావణికో పుట్టింటికి పోవాలనే ప్రవృత్తి తెస్తూవుంటుంది. కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది. అప్పుడు గారి మనస్సు మెత్తబడుతుంది. భర్తతో ఆ విషయం కదిలిస్తుంది. ఆయనేమో ఇదీవరస.

ఇదంతా ధర్మారావుకి తెలిసిన భాగమే. ఇంట్లో వాళ్ళంతా ఎవరి కార్యక్రమంలో వాళ్ళు నిమగ్నులై వున్నారు. అయినా ధర్మారావుకు ఏదో వెలితిగా వుంది, ఎంత వద్దనుకున్నా శంకరం మాటలు తలపుకు వస్తున్నాయి.

బస్‌స్టాండులో,

కొడుకిక్కి కొంచెం ఎక్కువగానే హితబోధ చేశాడు, ధర్మారావు. "అదృష్టంకొద్దీ నీకీ ఉద్యోగం దొరికింది. సంపాదిస్తున్నాగదా అనుకుని అనవసరపు ఖర్చు చెయ్యకు. ఇంటిపరిస్థితి నీకు తెలియనిది కాదు. రెండో తారీఖు వచ్చిందంటే పది పన్నెండు కళ్ళు తపాలా బంట్రోతుకోసం ఆశగా ఎదురుచూస్తుంటాయి యిక్కడ. ఆఫీసులోకూడా జాగ్రత్తగా మసలుకో. ఎక్కడో ఆలోచిస్తున్నట్టు అలా పరధ్యానంగా వుండకు. రోజులు బాగాలేవు."

తండ్రిముఖంలోకి అదోలా చూసి అన్నాడు, శంకరం — "అట్టాగే లెండి. జీతంరాగానే డబ్బు పంపుతాను. సరేనా. మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా"

శంకరం స్వరంలో ధ్వనించిన తీవ్రతకి అవాక్కయిపోయాడు. ధర్మారావు, ఆయన ఏదో చెప్పబోయాడు, కాని, బస్‌స్టార్టయింది.

ధర్మారావు శంకరంకేసి చెయివూపేడు. శంకరం అప్పటికప్పుడే మొహాన్ని అటువైపుగా తిప్పేసుకున్నాడు.

బస్ ముందుకు వెళ్ళిపోయింది.

శంకరం హైదరాబాద్ వెళ్ళిపోయాడు.

టెలిగ్రాఫ్ స్తంభంలా నిలబడిపోయాడు, ధర్మారావు.

శంకరం అని వెళ్ళిన మాటలతో ఆయన హృదయం బరువుగావుంది. ఆ మాటల్లోని తీవ్రతతో ఆయన మనస్సు గిపెట్టోంది. ఆ తీవ్రతలో — ఈసడింపు, చిరాకు, నిర్లక్ష్యం, విసుగు — అన్నీ ధ్వనించాయి ఆయనకు.

ధర్మారావు నాలుక తడుపుకుని గుటకలు మింగేశాడు.

—'జీతం రాగానే డబ్బు పంపుతాను, సరేనా. మీరుచెప్పేదంతా దాన్ని గురించేగా?"

ధర్మారావు కళ్ళల్లో నీరు తిరిగింది.

ఏభై నాలుగేళ్ళ జీవితంలో — ఎన్నెన్నో సందర్భాల్లో ధర్మారావు కళ్ళు చెమ్మగిలినై. తల్లీతండ్రీ పోయి, తన వాళ్ళన్నవాళ్ళు కరువై వారాలు చేసుకుని చదువుకునే రోజుల్లో — ఆకలి తీవ్రతని అనుభవింపజేసిన రాత్రులు — ఆయన కళ్ళవెంట నీళ్లు చూసి చిరునవ్వు నవ్వుకునేవి. తెలుగు భాషని నమ్ముకుని అభిమానంగా సాహిత్యం చదివే రోజుల్లో — సాటివారి అవహేళనకూ ఆయన కళ్ళు చెమర్చేవి. ఉద్యోగంకోసం బెజవాడనుంచి వైజాగ్‌దాకా — స్టేషన్లు మారుతూపోయి తిరిగి తిరిగి బెజవాడ చేరుకుని ఈ కంపెనీలో గుమాస్తాగా చేరిన రోజుల్లో — కనుకొలకుల్లో ముత్యాలు నిలిచేవి. పెళ్ళయి శాంతమ్మతో కాపురం ఆరంభమైన తర్వాత ధర్మారావుకు కళ్ళు చెమర్చడం అలవాటుగా మారింది. అందుకనే, దృష్టిలోపం లేకపోయినా ఆ రోజుల్లోనే కళ్ళజోడు వాడటం మొదలెట్టేడు.

'మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా'—

'నాకంటే నా డబ్బేగదా మీకు ముఖ్యం' అన్నట్టు ప్రశ్నించాడు, శంకరం.

నిజానికి శంకరంకంటే శంకరం డబ్బు ముఖ్యమా తనకు?

ధర్మారావు కళ్ళముందు ఎన్నో దృశ్యాలు కదలాడినై.

సంక్రాంతి పండుగనాడు—

ఇల్లంతా కోలాహలంగా వుంది. మధ్యాహ్నం పన్నెండు దాటింది. పక్క పోర్షన్‌లోని వాళ్ళంతా తమ వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఉన్నట్టుండి ఏదో అదృశ్యహస్తం తన వెన్ను చరచినట్లయింది. 'శంకరం ఏడీ?'— ఎవరికివారు 'ఇక్కడే వుండాలి' 'ఇప్పుడే చూశాను' అంటూ సమాధానాలు యిచ్చేరు. అక్కడ లేడు. పెరట్లో, సామాన్లగదిలో, వీధిలో, బీరువాలల్లో అంతా వెతికేరు. కనిపించలేదు. చప్పున ఏదో స్ఫురించింది తనకు. దడదడలాడుతున్న గుండెతో, గబగబా డాబా మీదికి పరుగెత్తేడు తను. వెనగ్గా అంతా వచ్చేరు. తాను చూసిన దృశ్యానికి హృదయం విలవిల్లాడింది. పిట్టగోడమీద కూర్చుని దాని వారగా వున్న బాదం చెట్టు కొమ్మల్ని అందుకోచూస్తున్నాడు శంకరం. శిథిలావస్థలో వున్న మండిగోడ అది. అట్టే ఎత్తూ లేదు. ఒక్క ఉదటున వాణ్ణి చేతుల్లోకి తీసుకున్నాడు. ఈ సంఘటన తలపుకొస్తేనే చాలు—మనసంతా భయంతో వూగిపోయేది. "తాను వెళ్ళడం క్షణం ఆలస్యమైతే ఏమై వుండేది" అనే వూహే తన వెన్ను జలదరింపచేసేది. శంకరంకు అప్పుడు మూడో ఏడు!

వాడికి ఐదోయేట—

ఊరంతా వ్యాపించిన మశూచి తన యింటినీ పలకరించింది. శంకరం మంచమెక్కాడు. శరీరమంతా ముత్యాలు. కళ్ళల్లో వత్తులు వేసుకుని, కాగుతున్న పాలని

చూస్తున్నట్టు చూస్తూ కూర్చునేవాడు తాన ఇరవై వొక్క రోజులు.

అలాంటి శంకరం—

"మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా అని తేలిగ్గా అనేసి వెళ్ళిపోయాడు.


—"ఎంతసేపలా పచార్లు చేస్తూవుంటా; బజారుదాకా వెళ్ళి నాలుగు కూరలు తెం మళ్ళీ ఆఫీస్ టైమయిందంటూ ముళ్ళమీ కూర్చుంటారు."

శాంతమ్మ మాటలకు ఈ లోకంలో పడ్డా ధర్మారావు. చేతి సంచీ అందించిందా; ఆయన బయటికి నడిచాడు.

దారిలో పరంధామయ్య కలిసేడు. "; వాడికి ఉద్యోగమొచ్చిందటగా?" అడిగేడ

"అవును. ఇవ్వాళే వెళ్ళాడు"

"అదృష్టవంతుడివి. కొడుకు చేతికి అంది



చ్చాడు. ఇక నీ పని పైలాపచ్చీసూ పంచ కళ్యాణీ" అని "పార్టీ ఎప్పుడు మరి?" అంటూ ప్రశ్నించాడు.

ధర్మరావు పేలవంగా నవ్వేడు. పార్టీ మాటకు సమాధానం రాకపోవడంతో నిరుత్సాహం కలిగింది పరంధామయ్యకు. "వస్తా" అంటూ వెళ్ళిపోయాడు. పరంధామయ్య ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంటు.

నాలుగడుగులు వేసేసరికీ అహమ్మద్ తగిలేడు. అతనూ ధర్మారావు సహోద్యోగే.

"మీ వాడికి ఉద్యోగం వచ్చిందిటగా. మీ జీతంని ఇక నుంచీ కొంచెం సరదాగా ఖర్చెట్టుకోవచ్చు."

దానికీ ధర్మారావు పేలవమైన నవ్వే జవాబైంది.

కొంచెం సేపు ఆఫీసు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు-అహమ్మద్.

కూరల మార్కెట్లో గుర్నాధం కలిసేడు. ఆయన శాంతమ్మకి దూరపు చుట్టం, అన్న వరస, పల్లెలో బాగా మోతుబరిగా పేరు బడ్డాడు. శాంతమ్మకు పుట్టింటి నుంచీ వచ్చిన ఎకరం భూమి సంగతీ గుర్నాధమే చూస్తూ వుంటాడు.

ఏడాదికో మూడువందలో నాలుగువందలో తోచింది ఇచ్చిపోతూ వుంటాడు. కొన్నేళ్ళు పంటలు లేవని ఏమీ రాదు. ఆ పొలంమీద వచ్చే ఫలసాయం కంటే-దానికి చెల్లించాల్సిన శిస్తులు, సెస్సులు ఎక్కువగా వుంటున్నాయనే చిరాకు వుంది-ధర్మరావుకు. "డ్రైనేజి సెస్సు చెల్లించాలిట డెభ్భైరూపాయలు నాలుగైదు రోజుల్లో ఏర్పాటు చెయ్యండి బావగారూ" అన్నాడు. ధర్మారావుకు ఏం సమాధానం చెప్పాలో తెలీలేదు.

**క్షణాల తర్వాత గుర్నాధం అన్నాడు,** "**శంకరాయ్‌కి ఉద్యోగం వచ్చిందిటగా, వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా వుంటుందిలే వాడి సంపాదన ఫర్వాలేదు.**"

ధర్మారావుకి గుర్నాధం మాటలు వినిపించడంలేదు. డెభ్భై అంకె కళ్ల ముందు కనపడుతోంది.

తనకేదో కోర్టులో పనుందంటూ వెళ్ళిపోయాడు గుర్నాధం.

ధర్మారావు ముందుకు కదిలేడు.

—పదిగంటలకు ఆఫీసుకుచేరేడు ధర్మరావు. సహోద్యోగులంతా ధర్మారావుని అభినందించసాగేరు. చివరికి అందరిదీ ఒకే అభిప్రాయం, కోరిక—"పార్టీ కావాలి"!

ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉరుము ఉరిమింది. కేబిన్‌లో నిప్పులు కురిపిస్తున్నారు డైరెక్టర్ గారు. క్షణంలో విషయం అందరికీ అవగతమైంది. సుబ్రమణ్యం లోపల వున్నాడు. అతనికి పదాలు గొంతులో ఇరుక్కుపోయి వుంటాయని అనుకోసాగేరు—కేబిన్ బయట వున్న వాళ్లంతా. "మన కంపెనీ రూకలు చెల్లినై ఆయనకి"—అన్నాడు అహమ్మద్.

వాతావరణంలో వో ఫిరంగి మ్రోగింది. ప్యూన్ వచ్చి హడావిడిగా చెప్పేడు, "మిమ్మల్ని బాస్ పిలుస్తున్నారు."

ధర్మారావు లోపలికి వెళ్ళాడు. "ధర్మారావు గారూ, కంపెనీ సొమ్ము నాలుగువేలు తాను "మిస్ అప్రాప్రియేట్" చేసినట్లు నేరం వొప్పుకుంటూ ఈయన వ్రాసి యిచ్చిన లెటర్ ఇది, డిస్మిసల్ ఆర్డర్ తయారు చేయించండి"

అన్నారు ఇద్దరికేసీ చూస్తూ. ఇద్దరూ ఇంటికి వచ్చేశారు.

ఆ తర్వాత-యూనియన్ వారి రాయబారం సుబ్రమణ్యం తమాషణకై వేడికోలూ వగైరా-అన్నీ చకచకా సాగిపోయినై, డైరెక్టర్ మాత్రం తన నిర్ణయాన్ని సడలించుకోలేదు. ఋజువైన నేరాన్ని గురించీ, దోషి తానే అంగీకరించిన నేరాన్ని గురించీ ఎవరు ఎన్ని చెప్పినా వినని ఖండితంగా చెప్పేశాడు.

సుబ్రమణ్యం డిస్మిస్ అయ్యాడు. తన చేతిమీదుగా ఆర్డర్‌ని "సర్వ్" చేయాల్సివచ్చినందుకు బాధపడ్డాడు ధర్మారావు. ఆ రాత్రి ధర్మారావుకు కంటినిండా నిద్ర కరువైంది.

—రెండో తారీఖు వచ్చింది! తలలా ఇంక్రిమెంటు కోసం ఎదురు చూసిన కళ్లకి నిరాశా చీకటే ఎదురైంది.

పదిహేనో తారీఖున తండ్రికి జాబు వ్రాసేడు శంకరం. "ఇక్కడ నేను క్షేమం. అక్కడ అంతా క్షేమమనుకుంటాను. ఇంతే సంగతులు, చిత్తగించవలెను"-ఇదీ సారాంశం!

శాంతమ్మ కళ్లు తుడుచుకుంది, ధర్మారావేమో తన మామూలు నవ్వు నవ్వుకున్నాడు, దీర్ఘంగా నిట్టూర్పు విడిచేడు. "నువ్వేమీ తప్పు చెయ్యనందుకు అమ్మా నాన్నా బాధపడుతున్నా"రంటూ అన్నకి ఉత్తరం రాసింది వరం.

బెరుకు బెరుకుగా, భయం భయంగా, అనుమానం అనుమానంగా మరో నెల గడిచింది.

మళ్ళీ వచ్చిన రెండో తారీకూ ధర్మారావుని పలకరించకుండానే వెళ్ళిపోయింది.

వరమ్మ రాసిన కవరుకు జవాబుగా పదిహేను రోజుల తర్వాత శంకరం రాసిన కార్డు వచ్చింది. "పదిమందిలో తిరిగేవాణ్ణి. నేను గుడ్డలు కుట్టించుకోవడానికే చాలేదు జీతం" అంటూ. శంకరం జీతం అంకె—ఆరు వందలమీద ఆరువేల కూడికలూ, తీసివేతలూ ఇతర లెక్కలూ చేయబడినై!

ధర్మారావు కళ్ళల్లో ఆశల వలయాలు గిరికీలు కొట్టి కొట్టి ఒకదానిలో ఒకటి అలుక్కుపోయి రూపరహితాలై పోయాయి. "మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా" అన్న శంకరం మాటలు చెవుల్లో మార్మోగినై.

అనావృష్టి మరో ఎనిమిది నెలలు సాగింది.

ఈనడుమ—అమ్మకు అనారోగ్యమంటూ వరమ్మ రాసిన జాబు కూడా శంకరం నుంచి మౌనాన్నే మోసుకొచ్చింది.

వరమ్మకి పెళ్ళి చూపులు జరిగినై.

ఆ రాత్రి—ధర్మారావు భార్యని అడిగేడు.- 'ఇంటి వాళ్ళ కోడలు కనిపించదేం ఇందాకా?' అని. "అయమ్మాయ్ పుట్టింటికి వెళ్ళిందండీ నిన్న. మళ్ళీ నీళ్ళుపోసుకుంది, నాలుగో నెల" అన్న సమాధానం విని నడుం వాల్చిన వాడల్లా ఠక్కున లేచి మంచంమీద కూర్చున్నాడు. "అవునండీ, కామేశంగారే వెళ్ళరమ్మన్నారట." అంటూ నిష్క్రమించింది శాంతమ్మ.

ధర్మారావు ఏదో స్వప్నంలోకి జారిపోయాడు

నాలుగు రోజుల తర్వాత—ఓ రోజు:



●షీసులో—

డైరెక్టరుగారు ధర్మారావుని కేబిన్‌లో పిల్చేరు. అప్పటికే అక్కడో కుర్రాడు నిలబడి వున్నాడు. "చూడండి ధర్మారావుగారు ఈ అబ్బాయి పేరు చంద్రశేఖరం. మన కంపెనీలో అటెండరుగా తీసుకుంటున్నాం. మిగిలిన పనులన్నీ చూడండి. ఇవ్వాళే ఇతను జాయిన్ అవుతున్నాడు" — అని చెప్పి మేనేజర్‌తో మాట్లాడటం మొదలెట్టేడు. ఆ తర్వాత తెలిసిందేమిటంటే — చంద్రశేఖరం సుబ్రమణ్యం తమ్ముడని! మాటల ప్రసక్తిలో చెప్పాడు, పరంధామయ్య సుబ్రమణ్యం కుటుంబం వీధులపాలు కాకుండా కాపాడాడు మన డైరెక్టర్, "ఇటీజ్ వెరీ కైండాఫ్ హిమ్" అంటూ.

ధర్మారావు స్వప్నంలోని కాంతి రేఖలు ఇంకా ఇంకా ముందుకు పయనించసాగేయి.

—"పిల్ల నచ్చింది. పదివేల కట్నం ఇచ్చేటట్లయితే ముహూర్తాలు పెట్టుకుందాం" ... అంటూ అందిన వార్త ధర్మారావు నెత్తినపాలు గుయ్యారాన్ని పడేసింది. "సంబంధం మంచిది. పిల్లవాడు బ్యాంకులో మంచి ఉద్యోగంలో వున్నాడు- ఎలాగైనా ఈ సంబంధం ఖాయం చేసుకుందాం" అంటూ శాంతమ్మ—భర్త చెవుల్లో ఇల్లు కట్టుకుంది. ధర్మారావుకేమో — కనీసం కావలసిన పదిహేనువేలు — అంకె తలచుకుంటే— గుండెలు జారిపోతున్నై.

వ్యూహాలూ, పథకాలూ, ప్రణాళికలూ రచించడం సాగిపోయింది. తనవల్ల కాదని తేల్చేసుకున్నాడు ధర్మారావు. అలాగని కబురు వెళ్ళింది-అవతలి వాళ్ళకి. ఈ వివరాల కవరు కూడా శంకరం నుంచీ పల్లెత్తు మాటని తీసుకురాలేదు. ఇంట్లో అంతా పళ్ళు కొరుక్కుని, గుప్పిట బిగపట్టుకున్నారు. "ఇంత కరోడిలా తయారౌతాడనుకోలేదు"-అనుకుంది శాంతమ్మ.

పదిహేను రోజుల తర్వాత—

బ్యాంకులో మంచి ఉద్యోగంలో వున్న అబ్బాయే ధర్మారావు యింటికి సకుటుంబంగా వచ్చాడు-పెళ్లికి ముహూర్తాలు పెట్టించండంటూ.

ధర్మారావుకి ప్రపంచంలోని మంచితనమూ అదృష్టమూ అంతా తన ముందే గుమ్మరించినట్లయింది. మనస్సు కృతజ్ఞతతో తడిసి ముద్దయిపోయింది, కళ్ళు సజలాలైనాయి!

మరో కొద్ది సేపటికే—

దేవాలయ ద్వారాలు తెరుచుకున్నాయి. ఎటు చూసినా కాంతి పట్టకాలు కదలాడుతున్నాయి, వాటి వెలుగు [illegible] ధర్మారావు కళ్ళను మిరుమిట్లు [illegible] కిరణం - శంకరం!

తన బొందెలో ప్రాణం వుండగా కొడుకుని పుట్టింటికి పంపనే పంపను అన్న కామేశం గారూ; సుబ్రమణ్యంని డిస్మిస్‌చేసి చంద్రశేఖరంకి ఉద్యోగమిచ్చిన డైరెక్టరూ, పదినెలలు నిరాశనే పంచిపెట్టి ఇప్పుడొక బాధ్యతని మోస్తున్న శంకరమూ — అంతా అవంత కళల్ని సృష్టిస్తున్న కళాకారులుగా కనిపిస్తున్నారు - ధర్మారావుకి.

కట్నం డబ్బు చేతికి అందిన పెళ్ళివారు ధర్మారావు పట్ల అభిమానం, ఆప్యాయత, అన్నిటినీ మించిన అణకువ — చాలా ఎక్కువగానే చూపాలని తాపత్రయ పడుతున్నారు. వీరూ ఆ కళాకారుల బృందంలో సభ్యులు!

"మరి నువ్వో?" - ఎవరో ప్రశ్నించినట్లయి ఉలిక్కిపడ్డాడు ధర్మారావు. నిద్ర నుంచీ తేరుకున్నట్లయింది. "మీరు చెప్పేదంతా దాన్ని గురించేగా" అన్న శంకరం మాటలు గుర్తుకొచ్చినై.

వేదాంతిలా నవ్వుకోబోయి, ప్రతి నాయకుడి నవ్వు నవ్వేశాడు — ధర్మారావు!!! ✱


వాడని మల్లెలు
మీ అభిమానానికి రుజువులు... ముళ్ళపూడి రచనలు

| | | | |
|---|---|---|---|
| నవ్వితే నవ్వండి-2 ............ | ప్రథమ ముద్రణ | | 6.50 |
| భగ్నవీణలూ బాష్పకణాలూ .......... | రెండవ | " | 8.00 |
| 80 రోజుల్లో భూప్రదక్షిణం ...... | " | " | 15.00 |
| విక్రమార్కుడి మార్కు సింహాసనం.. | మూడవ | " | 12.00 |
| బుడుగు-2 ...................... | " | " | 10.00. |
| రాజకీయ బేతాళ పంచవింశతిక.. | ఐదవ | " | అచ్చులో... |
| జనతా ఎక్స్‌ప్రెస్ ................ | " | " | 5.50 |
| బుడుగు-1 ...................... | " | " | 10.00 |
| గిరీశం లెక్చర్లు ................ | " | " | 5.50 |
| ఇద్దరమ్మాయిలూ-ముగ్గురబ్బాయిలూ... | ఆరవ | " | 4.50 |
| రాధాగోపాలం .................... | " | " | 6.00 |
| ఋణానందలహరి .................... | ఏడవ | " | 7.00 |
| నవ్వితే నవ్వండి-1 ................ | " | " | 6.00 |

పుస్తకాల ఖరీదులో రెండు రూపాయలు తగ్గించి ముందుగా M.O పంపితే పోస్టు ఖర్చులు మేమే భరించి రెండు రూ.లకే వి.పి.పోస్టులో పంపగలము.



నవోదయ పబ్లిషర్స్ విజయవాడ-2 గుంటూరు-2